సాక్షి కామారెడ్డి

శనివారం । 5 । ఆగస్టు । 2023



ముఠా అరెస్ట్

జిల్లాకేంద్రంలోని ఓ దుకాణం షట్టర్ తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో ▸



చట్టాలపై అవగాహన

జిల్లా సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి శుక్రవారం జిల్లాకేంద్రంలోని సబ్ జైల్‌లో ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.5 /22.9

ఉదయం ఆహ్లాదకర గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ, అప్పుడప్పుడు జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

లక్ష గాజుల పూజ



గాజులతో అలంకృతురాలైన వాసవీమాత



జిల్లాకేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

జిల్లాకేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. లక్ష గాజులతో అమ్మవారిని అర్చించారు. అమ్మవారిని, గర్భగుడిని గాజులతో అలంకరించారు. అనంతరం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మోగిలిపల్లి భూమేష్, కోశాధికారి విశ్వనాథుల రాజేందర్, నాయకులు పేపర్ శ్రీనివాస్, యాద అంజయ్య, గరిపల్లి శ్రీధర్, ఆలయ అర్చకులు కృష్ణమూర్తిశర్మ, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- కామారెడ్డి టౌన్



పూజలో పాల్గొన్న భక్తులు

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే పేరుతో ఫేక్ ఇన్‌స్టా గ్రాం అకౌంట్

సాక్షి, కామారెడ్డి: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏకంగా ఎమ్మెల్యే పేరుతో ఇన్‌స్టాగ్రాంలో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసిన ఘటన వెలుగు చూసింది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేరుతో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసిన దుండగులు.. డబ్బులు అడుగుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనుచరులు మిగతావారిని అప్రమత్తం చేశారు. దుండగులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే పేరుతో ఫేక్ ఇన్‌స్టా గ్రాం ఖాతా తెరిచారని, డబ్బులు అడుగుతున్నారని ఎమ్మెల్యే పీఏ తెలిపారు. దానికి ఎవరూ స్పందించవద్దని, ఫేక్ అకౌంట్‌ను అందరూ బ్లాక్ చేయాలని కోరారు.

'అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు'



కామారెడ్డి రూరల్: అంకితభావంతో పని చేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని డీఈవో రాజు పేర్కొన్నారు. డీఈవో కార్యాలయంలో రెండేళ్లపాటు అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్‌గా పనిచేసిన టీచర్ మనోహర్ తిరిగి రెడ్డిపేట హైస్కూల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఈవో కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం అధిపతి నీలం లింగం, సెక్టోరల్ అధికారులు ఉమారాణి, శ్రీపతి, వేణుగోపాల్, రమణారావు, ఎంఈవోలు ఎల్లయ్య, రామస్వామి, యోసెఫ్, దేవునిపల్లి పాఠశాల హెచ్ఎం గంగాకిషన్ పాల్గొన్నారు.

పోచారం ప్రాజెక్ట్ హెడ్ రెగ్యులేటర్ గేట్ల పరిశీలన



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే ప్రాంతంలో ఇటీవల మరమ్మతులు చేపట్టి నూతనంగా ఏర్పాటు చేసిన హెడ్ రెగ్యులేటర్ గేట్లను శుక్రవారం నీటిపారుదల శాఖ మెకానికల్ విభాగం అధికారులు పరిశీలించారు. గతనెలలో రూ.25 లక్షలతో ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ గేట్లకు మరమ్మతులు చేయించారు. చేపట్టిన పనుల గురించి ఎల్లారెడ్డి ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు వారికి వివరించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మెకానికల్ విభాగానికి చెందిన ఈఈ విద్యానంద్, డీఈఈ రాములు పాల్గొన్నారు.

ఆయుష్ ఆరోగ్య కరదీపిక ఆవిష్కరణ

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయుష్ ఆరోగ్య కరదీపికలు ఆవిష్కరించారు. విద్యార్థులకు హోమియో మెడిసిన్ అవశ్యకతను వివరించారు. అనంతరం డెంగీ ప్రివెంటివ్ మాత్రలను విద్యార్థులకు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దేవయ్య, ఎంఎన్‌వో రాజన్న, ఫార్మసిస్ట్ శ్రీనివాస్, టీచర్లు నీలిమ, సహేందర్, జంగం శ్రీశైలం, చంద్రమూర్తి, సాదిక్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల హరితహారం



కామారెడ్డి అర్బన్: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో శుక్రవార ఔషధ మొక్కల హరితహారం నిర్వహించారు. కలెక్టరేట్ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న యోగా అసోసియేషన్ భవనం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ ఆయుర్వేద శిరోమణి ఆచార్య బాలకృష్ణ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రాందేవ్‌బాబాతో కలిసి ఆచార్య బాలకృష్ణ నాణ్యమైన స్వదేశీ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో పతంజలి యోగా అసోసియేషన్ ప్రతినిధులు పి.అంజయ్య, బి.రఘుకుమార్, బి.అనిల్‌రెడ్డి, కే.సిద్ధాగౌడ్, సత్యం, నరేందర్, ఆంజనేయులు, వసంత్, అనిల్, సత్యనారాయణ, శ్రీనివాస్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్ కలేనా?

- కామారెడ్డి చెరువు వద్ద ఏడేళ్ల క్రితం శంకుస్థాపన
- ఇప్పటికీ అసంపూర్తిగానే పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

జిల్లాకేంద్రంలోని ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు పెద్ద చెరువు వద్ద చేపట్టిన మినీ ట్యాంక్ బండ్ పనులు.. ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. శంకుస్థాపన చేసి ఏడేళ్లు దాటినా.. ఇప్పటికీ సుందరీకరణకు నోచుకోలేదు. చేపట్టిన పనులు సైతం నాసిరకంగా ఉండడంతో దెబ్బ తింటున్నాయి.

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం 2016లో చర్యలు చేపట్టింది. మిషన్ కాకతీయ ఫేస్–2లో భాగంగా రూ. 8.96 కోట్లు మంజూరు చేసింది. 2016 జూన్ 17న శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ నిధులతో చెరువులో పూడిక తీశారు. కట్ట బలోపేతం పనులు చేపట్టారు. కట్టపైన రోడ్డు వేసి చెరువు వైపు స్టీల్ రెయిలింగ్, ఫుట్‌పాత్ కోసం పార్కింగ్ టైల్స్ వేశారు. కట్టపైన సోలార్ విద్యుత్ దీపాలను అమర్చారు. అయితే ఇప్పటికీ ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే పనులను మాత్రం చేపట్టలేదు. కూర్చోడానికి బెంచీలు కూడా లేవు. కట్టకు ఇరువైపులా మొక్కలను నాటాల్సి ఉంది. మినీ ట్యాంక్‌బండ్‌లో భాగంగా చెరువు సుందరీకరణతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని భావించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది.



కామారెడ్డి పెద్ద చెరువు కట్టపై కంకర తేలిన రోడ్డు



చెడిపోయిన లైట్,



తాగిపడేసిన బీరు బాటిళ్లు

సుందరీకరిస్తే..

విశాలంగా ఉన్న కామారెడ్డి పెద్ద చెరువు వర్షాకాలంలో ఆహ్లాదాన్ని పంచుతుంది. భారీ వర్షాలు కురిసి అలుగు పారుతున్న సమయంలో చెరువు అందాలను వీక్షించడానికి వేలాది మంది తరలివస్తుంటారు. అయితే మినీ ట్యాంక్‌బండ్ పనులు పూర్తి కాకపోవడంతో పర్యాటకులు చెరువు కట్ట వద్దకు వెళ్లలేకపోతున్నారు. మినీ ట్యాంకుబండ్ పనులను పూర్తి చేస్తే పట్టణవాసులు నిత్యం చెరువు వద్దకు వచ్చి సేదదీరే అవకాశాలుంటాయి. పాలకులు స్పందించి, పెద్దచెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా, నాసిరకంగా పనులు..

పెద్ద చెరువు వద్ద చేపట్టిన పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటించలేదు. దీంతో వేసిన కొద్ది రోజులకే ఫుట్‌పాత్ టైల్స్ దెబ్బతిన్నాయి. సీల్ రెయిలింగ్ ఊడిపోయింది. కట్టపైన వేసిన రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. పచ్చదనం ఏర్పాటు చేయకపోవడంతో కళావిహీనంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. సోలార్ విద్యుత్ దీపాలు చెడిపోవడంతో రాత్రి వేళలో అంధకారం అలుముకుంటోంది. దీంతో చెరువు కట్ట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మద్యంప్రియులు ఇక్కడికి వచ్చి మద్యం సేవించి, ఖాళీ సీసాలను ధ్వంసం చేసి వెళ్తున్నారు.



కామారెడ్డి పెద్ద చెరువు

22వ ప్యాకేజీ పనుల్లో వేగం పెంచాలి

- భూసేకరణకు నిధులు విడుదల చేయండి
- అసెంబ్లీలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



సాక్షి, కామారెడ్డి: ''కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని రైతులు బోరుబావులు, చెరువులు, కుంటల మీదనే ఆధారపడి సేద్యం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరుగుతుంది'' అని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో 2 లక్షల ఎకరాలకు సాగునీరందించడానికి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 22వ ప్యాకేజీ చేపట్టారన్నారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులు విడుదల చేయాలని, ఆరేడు నెలల్లో పనులు పూర్తి చేసి నీటి కష్టాలు తీర్చాలని కోరారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా : మంత్రి వేముల

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రస్తావించిన అంశంపై శాసనసభా వ్యవహారాల మంత్రి ప్రశాంత్‌రెడ్డి సభలో వివరణ ఇచ్చారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ అంశాన్ని నోట్ చేసుకున్నామన్నారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.

'ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మను చౌదరి

కామారెడ్డి క్రైం: ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. 30 ఏళ్లపైబడిన ప్రతి ఒక్కరు షుగర్, బీపీ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలన్నారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. క్లిష్ట పరిస్థితులలో మాత్రమే సిజేరియన్‌లు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. పీహెచ్‌సీల వారీగా వివిధ కార్యక్రమాల పనితీరును సమీక్షించారు. ప్రసవాలు తక్కువగా చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పని తీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టి–హబ్‌ల పనితీరును సమీక్షిస్తూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రోజు కనీసం 15 శాంపిల్స్ పంపాలన్నారు. మాతాశిశు సంరక్షణ, సార్వత్రిక టీకాలు, టీబీ, షుగర్‌లాంటి కార్యక్రమాలపై సూచనలు ఇచ్చారు. సమావేశంలో డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం

కామారెడ్డి టౌన్: పరువు నష్టం కేసులో రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్ వద్ద టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గోనె శ్రీను, నయీం, పాత శివకృష్ణమూర్తి, శ్రీనివాస్, మక్సూద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్వేషంపై విజయం..

సుప్రీంకోర్టు ఇచ్చిన స్టే విద్వేషంపై విజయమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో ఫోన్ ద్వారా మాట్లాడారు. కుట్రపూరితంగా రాహుల్ గాంధీ ఎంపీ పదవిపై అనర్హత వేటు వేశారని ఆరోపించారు. సుప్రీం తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. కోర్టు తీర్పుతో న్యాయ వ్యవస్థలపై ప్రజల్లో మళ్లీ విశ్వాసం పెరిగిందన్నారు. ప్రజలు త్వరలోనే బీజేపీకి బుద్ధి చెబుతారన్నారు.



జిల్లా కేంద్రంలో నినాదాలు చేస్తున్న నేతలు

వీఆర్‌ఏల కోసం సూపర్‌న్యూమరీ పోస్టులు!

- జిల్లాకు 604 పోస్టులు మంజూరు
- పెండింగ్‌లో మరో 825 పోస్టులు..

సాక్షి, కామారెడ్డి : రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం.. వారి కోసం సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించింది. అందులో భాగంగా జిల్లాకు 604 పోస్టులు మంజూరు చేసింది. విద్యార్హతల ఆధారంగా రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల, మిషన్ భగీరథ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, చైన్‌మన్, హెల్పర్, లష్కర్ వంటి పోస్టులలో సర్దుబాటు చేయనుంది.

జిల్లాలో 1,429 మంది వీఆర్‌ఏలు..

భూస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా నిలిచిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్(వీఆర్‌ఏ) వ్యవస్థను రద్దు చేస్తూ సీఎం కేసీఆర్ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. నీరటి, మస్కూరు, లష్కర్ తదితర పేర్లతో పిలవబడుతున్న వీఆర్‌ఏలను సూపర్ న్యూమరీ పోస్టుల్లో రెగ్యులరైజ్ చేస్తామని సీఎం పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం సూపర్ న్యూమరీ పోస్టులను మంజూరు చేసింది. జిల్లాలో 1,429 మంది వీఆర్‌ఏలు పని చేస్తుండగా ప్రస్తుతం 604 పోస్టులు మంజూరయ్యాయి. ఇంకా 8 వందల పైచిలుకు పోస్టులు మంజూరు కావాల్సి ఉంది.

విద్యార్హతల ఆధారంగా..

రెవెన్యూ వ్యవస్థలో గ్రామ స్థాయిలో వీఆర్వోల తర్వాత వీఆర్‌ఏలే కీలకంగా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొదట వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి.. వారిని ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో సర్దుబాటు చేసింది. ఇప్పుడు వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసిన సర్కారు.. వారి కోసం వివిధ శాఖల్లో సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించింది. విద్యార్హతల ఆధారంగా వీఆర్‌ఏలను ఆయా శాఖల్లోని పోస్టుల్లో సర్దుబాటు చేయనుంది.



శాఖల వారీగా పోస్టుల వివరాలు

శాఖ	సూపర్ న్యూమరీ పోస్ట్	పోస్టుల సంఖ్య
రెవెన్యూ	జూనియర్ అసిస్టెంట్	92
రెవెన్యూ	రికార్డ్ అసిస్టెంట్	113
రెవెన్యూ	ఆఫీస్ సబార్డినేట్	33
రెవెన్యూ	చైన్‌మన్	24
మున్సిపల్	వార్డ్ ఆఫీసర్	22
నీటిపారుదల	లష్కర్	145
నీటిపారుదల	హెల్పర్	37
మిషన్ భగీరథ	హెల్పర్	138

వైన్‌షాప్‌లకు దరఖాస్తు చేసుకోండి

- 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీంద్రరాజు

కామారెడ్డి క్రైం: నూతన మద్యం పాలసీ (2023–25)కి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీంద్ర రాజు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని కామారెడ్డి, దోమకొండ, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద ఆబ్కారీ స్టేషన్‌ల పరిధిలో 49 మద్యం దుకాణాలు ఉన్నాయని, ఇందులో 14 దుకాణాలను వివిధ వర్గాలకు రిజర్వ్ చేశామని పేర్కొన్నారు. జిల్లాలో 5 వేలలోపు జనాభా ఉన్న ప్రాంతాలలో 7 దుకాణాలు, 5 వేలనుంచి 50 వేలలోపు జనాభా ఉన్న ప్రాంతాలలో 33 దుకాణాలు, ఆపై జనాభా ఉన్న ప్రాంతాలలో 9 దుకాణాలు ఉన్నాయన్నారు. ఆయా దుకాణాలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశామని, శుక్రవారం నుంచే దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో స్టేషన్‌ల వారీగా 5 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తిగలవారు దరఖాస్తులను నేరుగా సమర్పించాలని, పోస్టు ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపిస్తే స్వీకరించబోమని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా గాని, భాగస్వామ్యంగా గాని, సంస్థ ద్వారా గాని రాష్ట్రంలోని ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు వెంట రూ. 2 లక్షల డీడీ లేదా చలానా చెల్లించాలని, ఈ మొత్తం తిరిగి ఇవ్వబడదని పేర్కొన్నారు. ఆధార్, పాన్ కార్డు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను దరఖాస్తుకు జతచేయాల్సి ఉంటుందన్నారు. 21 ఏళ్లలోపువారు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేయడానికి అనర్హులన్నారు. ఈ నెల 21న సిరిసిల్ల రోడ్‌లోని రేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా నిర్వహిస్తామని పేర్కొన్నారు. మద్యం దుకాణం దక్కినవారు అదేరోజు గాని లేదా మరుసటి రోజు గాని లైసెన్స్ ఫీజులో ఆరో వంతు డబ్బును చెల్లించాల్సి ఉంటుందన్నారు. లేని పక్షంలో డిఫాల్టర్ అవుతారని పేర్కొన్నారు. నూతన మద్యం దుకాణదారులకు నవంబర్ 30న స్టాక్ ఇస్తామని, డిసెంబర్ 1 నుంచి దుకాణాలను నడుపుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐలు విజయ్ కుమార్, మధుసూదన్, సాజిద్ అహ్మద్, సుందర్ సింగ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న రవీంద్ర రాజు

నటేశ్వర శర్మకు విశ్వసాహితీ పురస్కారం

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వంనుంచి దాశరథి సాహితీ పురస్కారం అందుకున్న జిల్లాకేంద్రానికి చెందిన నటేశ్వర శర్మను మరో పురస్కారం వరించింది. విశ్వసాహితి సాహిత్య సంస్థ, మలయాళ స్వామి మఠం సంయుక్తంగా సాహితీ పురస్కారం ప్రదానం చేశాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని మలయాళ స్వామి పీఠంలో ఆంధ్రభాషా భూషామణి పురస్కార గ్రహీత ఆచార్య శలాక రఘునాథశర్మ చేతులమీదుగా నటేశ్వర శర్మ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, విశ్వసాహితి నిర్వాహకులు తంగిరాల చక్రవర్తి, రావి దుర్గాప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న నటేశ్వర శర్మ

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 10,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వరద కాలువ ద్వారా రెండు వేల క్యూసెక్కులు, కాకతీయకాలువ ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా 1089.90(84.21 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నేడు జిల్లా కోర్టులో కంటి వైద్య శిబిరం

ఖలీల్‌వాడి: జిల్లా న్యాయసేవాధికార సంస్థ, శ్రీ చెశ్మ ఆప్టికల్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి పద్మావతి తెలిపారు. న్యాయవాదులు, న్యాయ సిబ్బంది, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి



భీమ్‌గల్: హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో మొక్కలు నాటాలన్నారు. నర్సరీ, ఇంకుడు గుంతల నిర్వహణ చేపట్టాలని తెలిపారు. అంతకు ముందు బడా భీమ్‌గల్‌లో హరితహారం పనులను పరిశీలించి మొక్కలు నాటారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో గంగమోహన్, ఏపీవో నర్సయ్య పాల్గొన్నారు.

పలువురికి అకడమిక్ పోస్టులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎం యాదగిరి పలువురు అధ్యాపకులను అకడమిక్ పదువుల్లో నియమించారు. బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం ప్రసన్నశీలను మైక్రోబయాలజీ విభాగానికి, బోటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అహ్మద్ అబ్దుల్ హలీం ఖాన్‌ను ఫారెస్ట్ విభాగానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌లుగా నియమించారు. సోషల్ వర్క్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరభద్రం బుక్యాను సైన్స్ విభాగం ఇన్‌చార్జి హెచ్‌వోడీగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పచ్చిబుట్ట రైతుల పరేషాన్

- నగానికి తగ్గిన దిగుబడి
- గిట్టుబాటు ధర కూడా దక్కని వైనం
- ఆందోళనలో రైతులు

బాల్కొండ: పచ్చిబుట్టకు ధర లేక, దిగుబడి రాక పచ్చిబుట్ట సాగు చేసిన రైతుల ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత సంవత్సరం అధికంగా వర్షాలు కురువడంతో పచ్చిబుట్ట పంటపై తీవ్ర ప్రభావం చూపింది. పచ్చి బుట్ట కోసం రైతులు మే నెల చివరి వారంలో విత్తుతారు. 60 రోజుల్లో పచ్చిబుట్ట చేతి కొస్తుంది. ప్రస్తుత సంవత్సర బుట్ట ఎదిగే దశలో నిరంతరం వర్షాలు కురవడంతో దిగుబడి అమాంతం తగ్గింది. ఎకరానికి 5 నుంచి 6 టన్నుల దిగుబడి వచ్చే పచ్చిబుట్ట ప్రస్తుతం రెండు నుంచి మూడు టన్నులకు పడిపోయింది. ముందస్తుగా పచ్చిబుట్ట కోసం సాగు చేసిన పంటతో పాటు ప్రస్తుతం సాగవుతున్న పంటలో కూడా కంకులు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

కిలోల చొప్పున కొనుగోలు

పచ్చిబుట్టను మొదట్లో ఎకరాల చొప్పున వ్యాపారులు కొనుగోళు చేశారు. కానీ ప్రస్తుతం దిగుబడి రాకపోవడంతో కిలోల చొప్పున కొంటున్నారు. కిలోకు రూ.8 చొప్పున చెల్లిస్తున్నారు. గతంలో కిలోకు రూ.10 పైనే ధర పలికింది. ప్రస్తుతం వర్షాలతో కంకులు సన్నగా ఉండటంతో ధరను వ్యాపారులు తగ్గించేశారు. కిలోకు 3కంకులు వస్తాయి. మార్కెట్‌లో ఒక కంకిని రూ.10కి విక్రయిస్తున్నారు. కానీ రైతుల వద్ద మాత్రం ధర లేదంటు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. మక్క బుట్ట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.



బుస్సాపూర్‌లో పచ్చిబుట్టను డీసీఎం వ్యానులో నింపుతున్న కూలీలు

దిగుబడి రావడం లేదు



ప్రస్తుత సంవత్సరం పచ్చి బుట్ట దిగుబడి సగం కూడా రావడం లేదు. ఎకరానికి 2 టన్నులు మాత్రమే వచ్చింది. వర్షాలు ఎక్కువగా కురువడంతో మక్క కంకులు పెద్దగా వేయలేదు. ధరకు కూడ కిలోకు రూ.8 మాత్రమే దక్కుతుంది. తీవ్రంగా నష్టపోతున్నాం.

– సాయన్న, రైతు, బుస్సాపూర్

ధర నిలకడగా లేదు



మక్క కంకుల ధర నిలకడగా లేదు. దీంతో రైతులకు కూడా ధరను చెల్లించలేక పోతున్నాం. వర్షాలతో రవాణ సౌకర్యం కూడా దెబ్బ తినడంతో రవాణా ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. గోదావరి ఖనికి ఎక్కువగా తరలిస్తున్నాం.

– రాజు, వ్యాపారి

పాలన నచ్చడంతోనే బీజేపీలో చేరుతున్నారు

- బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణ తార

మద్నూర్(జుక్కల్): దేశంలో భారతీయ జనతా పార్టీ పాలన నచ్చడంతోనే చాలా మంది పార్టీలో చేరుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అరుణతార పేర్కొన్నారు. మేనూర్‌లో శుక్రవారం గ్రామానికి చెందిన పలువురికి ఆమె బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రపంచ దేశాలు ఇండియా వైపు చూస్తున్నాయని అన్నారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ జెండా ఎగురవేద్దామని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు హన్మాండ్లు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ పంతులు, ఉపాధ్యక్షుడు సతీష్ జోషి, అరుణ్‌పటేల్, నాయకులు హన్మాండ్లు, తుకారం, యాదవ్‌రావ్, గడ్డి తుకారం, బాలాజీ పటేల్, శివాజీ పటేల్, సంతోష్ తదితరులున్నారు.



మేనూర్‌లో పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరుణ తార

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి సుభాష్ రెడ్డి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రైతులకు ఎలాంటి షరతులు విధించకుండా ప్రభుత్వం రుణమాఫీ చేయాలని పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 2014 నుంచి 2023 ఆగష్టు వరకు రైతులకు ఉన్న రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలన్నారు. రుణాలను రెన్యువల్ చేసిన వారికి సైతం రుణమాఫీ చేయాలని, రుణాలను చెల్లించిన రైతులకు వారి బ్యాంకు ఖాతాలలో రుణ మాఫీ డబ్బులను వేయాలన్నారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింలు, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, ధనంజయ్ ఉన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

కామారెడ్డి రూరల్/లింగంపేట(ఎల్లారెడ్డి): గుణాత్మకమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వహీద్ సిద్దిఖీ, గంగా కిషన్‌లు సూచించారు. శుక్రవారం వారు లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో, కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత సబ్జెక్టుపై నిర్వహిస్తున్న మూడవ రోజు శిక్షణలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యా బోధనలో మెలకువలు పాటించాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలన్నారు. ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలన్నారు. మండల నోడల్ అధికారి సాయన్న, డీఆర్‌పీలు మహిపాల్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వహీద్ సిద్దిఖీ

తెయూకు చేరుకున్న స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ నాయకులు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ నాయకులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీకి వచ్చారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యార్థులతో వివిధ అంశాలపై చర్చించారు. రాబోయే ఎన్నికల్లో యూనివర్సిటీ విద్యార్థులు ఎన్నికల్లో భాగస్వామ్యం కావల్సిన ప్రాధాన్యతను ప్రతి గ్రామానికి చేరవేయాలన్నారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వలికొండ నర్సింహం మాట్లాడుతూ ఇక్కడ చర్చించి ప్రతి అంశం అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టేలా కృషి చేస్తామన్నారు. అనిల్, బోడ వంశీనాయక్, సాయివర్మ, సంజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్ల కలక

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో సుమారు 60 కళ్ల కలక కేసులు నిర్ధారణ అయినట్లు వైద్యాధికారులు తెలిపారు. జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో పది మందికి, మైనారిటీ గురుకుల పాఠశాలలో తొమ్మిది, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఐదు, బీసీ వేల్ఫేర్‌లో హాస్టల్‌లో తొమ్మిది, బాలికల ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో 20 మందికి కళ్ల కలక వచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలి



ధర్పల్లి: విద్యార్థులకు గణిత బోధనలో ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలని రాష్ట్ర పరిశీలకులు కిషన్ సూచించారు. ధర్పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న గణితంపై ఎఫ్ఎల్ఎన్ శిక్షణను ఆయన సందర్శించారు. ఏఎంవో నరేష్, నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, ప్రసన్నకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వడ్డీ మాఫీ చేసి రుణం మిగిల్చారు

జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్ రెడ్డి



రామారెడ్డిలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

రామారెడ్డి: గత ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్కార్ రూ.లక్ష రుణమాఫీ చేస్తామని రైతులకు హామీ ఇచ్చి మళ్లీ ఎన్నికల ముందు రైతులు తీసుకున్న రుణంపై ఆయన మిత్తిని మాఫీ చేసి రుణాన్ని మిగిల్చారని జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం రామారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. రుణ మాఫీ విధివిధానాలేంటో చెప్పకుండా, బీఆర్ఎస్ నాయకులు ఊరూరా క్షీరాభిషేకం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రూ.లక్ష రుణం తీసుకున్న రైతులకు రూ.60 వేల నుంచి రూ.70 వేల వడ్డీ వచ్చిందని, ఆ వడ్డీ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఒకే విడతలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తే తాగుబోతుల తెలంగాణగా మార్చేందుకు ముందస్తుగా వైన్స్ వేలం నోటిఫికేషన్లు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోసానిపేట సర్పంచ్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు నామాల రవి, నర్సింలు, రాజు పాల్గొన్నారు.

ఖైదీలకు చట్టాలపై అవగాహన

కామారెడ్డి టౌన్: తెలంగాణ న్యాయ సేవ అధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల మేరకు కామారెడ్డి సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. శ్రీదేవి జిల్లా కేంద్రంలోని సబ్‌జైల్‌ను శుక్రవారం సందర్శించారు. జైల్‌లో ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. జైలు ఆవరణలో ఫిర్యాదుల బాక్స్‌ను, వంట గదిని పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది ఆర్‌బీ రమేశ్ చంద్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది కె. మోహన్ రావు, అసిస్టెంట్ చీఫ్ లీగల్ ఎయిడ్ పి. చిరంజీవి, జిల్లా సేవ అధికారి సంస్థ సూపరింటెండెంట్ వి.చంద్రసేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబ్ జైల్‌లో ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న కామారెడ్డి సివిల్ జడ్జి శ్రీదేవి

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వడ్డెర కులస్తులను బీసీ 'ఏ' నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు ర్యాపని సహేందర్ పేర్కొన్నారు. శుక్రవారం పద్మాజివాడి చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది వడ్డెర కులస్తులు ఉన్నారన్నారు. కాంట్రాక్టులు, టెండర్లు వడ్డెరలకు చెందేలా చూడాలన్నారు. వడ్డెర కులస్తులు ప్రమాదవశాత్తూ మరణిస్తే బీమా కింద రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని వడ్డెరలకు ఇళ్లు ఇవ్వాలని కోరారు. వడ్డెర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సహేందర్

సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం హర్షణీయం

బాన్సువాడ: పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై వేసిన జైలు శిక్షపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం హర్షణీయమని బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం బాన్సువాడలో టపాసులు పేల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసు వేసిన వారికి ఇది చెంపపెట్టు అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి గణేష్, ఖలేక్, హన్మాండ్లు, దాసరి శ్రీనివాస్, నార్ల రఘు, షాహబ్, గొల్ల వెంకన్న, రెంజర్ల సాయిలు, జీవన్, తదితరులు ఉన్నారు.



స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

మాచారెడ్డి: జైలు శిక్ష కేసులో సుప్రీం కోర్టు రాహుల్ గాంధీకి ఊరట కలిగించడంతో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు మాచారెడ్డిలో టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. నేతలు నౌసిలాల్, అస్లాం, శంకర్ నాయక్, బన్సీలాల్, రాజిరెడ్డి ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ ఏసీపీ జగదీశ్‌చందర్ సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో గల ఐదో వార్డులో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. కాలనీల్లో ఎవరైనా అనుమానితులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, ట్రాఫిక్ నింబంధనలు పాటించాలన్నారు. ఈ తనిఖీలో 64 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ రౌడీ షిటర్‌ను, ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు, రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ జగదీశ్‌చందర్

క్రైం కార్నర్

చోరీకి యత్నించిన ముఠా అరెస్టు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలోని గాంధీ గంజ్‌లో ఓ షట్టర్ తాళాలు పగులగొట్టి దొంగతనానికి యత్నించిన ఓ ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ప్రకాష్ వివరాలు వెల్లడించారు. గత నెల 14న అర్ధరాత్రి సమయంలో గంజిలోని రాఘవేంద్ర ట్రేడర్స్‌లో దుకాణం తాళాలు పగలగొట్టిన కొందరు దుండగులు దొంగతనానికి విఫలయత్నం చేశారు. యజమాని కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. యజమాని ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం వేకువజామున నిజాంసాగర్ చౌరస్తాలో వాహనంలో వెళ్తున్న కొందరు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకన్నారు. వారిని హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్, ఫక్రుద్దిన్, నవీద్‌పాషా, రిద్వాన్, మనీష్ సోలాంకి, విజయ్‌సేన్‌లుగా గుర్తించారు. దొంగతనానికి యత్నించింది తామేనని, బృందంగా ఏర్పడి మళ్లీ దొంగతనాలు చేయడానికి కామారెడ్డి వచ్చామని నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రకాష్

కుక్కల దాడిలో గొర్రెల మృతి



రెంజల్: మండలంలోని కందకుర్తి గ్రామంలో కుక్కల దాడిలో గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన కుర్మె గంగాధర్ ఇంటి ముందు గల షెడ్డులో మేకలు, గొర్రెల మందను వదిలారు. గురువారం రాత్రి పిచ్చి కుక్కలు మందపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. తీవ్రంగా గాయపడ్డ 10 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఇప్పటి వరకు పిచ్చి కుక్కలు 40 వరకు గొర్రెలు, మేకలను చంపాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గంజాయి పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద గంజాయి అమ్ముతున్న మహ్మద్ ముసేఫర్ ఆలీఖాన్‌ను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి కిలోన్నర గంజాయితోపాటు ఆరు కత్తులు, 10 గంజాయి మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హైదరాబాద్‌లోని శాలిబండకు చెందిన వాడిగా గుర్తించారు. నిందితుడిని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన తుపాకుల రాజా (30) శుక్రవారం మధ్యాహ్నం చెరువులో పడి మృతి చెందాడు. కాలకృత్యాల కోసం చెరువుకు వెళ్లిన రాజా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గాంధారి: గాంధారిలో తాళం వేసిన ఓ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన పత్తి వెంకటి ఆరోగ్యం బాగా లేక పోవడంతో కుటుంబంతో కలిసి హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లారు. దొంగలు తాళాలు పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి ఆరు గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాకతీయ కాలువలో ఇద్దరి గల్లంతు



వేణు(ఫైల్)



ప్రణవ్(ఫైల్)

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా మెండోరా మండలకేంద్ర శివారులోని కాకతీయ కాలువలో శుక్రవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. మెండోరా ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన వేణు(24), ప్రణవ్(17)తోపాటు చింటు శుక్రవారం ఉదయం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చారు. అనంతరం మెండోరా మండల కేంద్రంలోని వారి స్నేహితుడు నోముల పవిత్ర్‌రెడ్డి వద్దకు వెళ్లారు. నలుగురు కలిసి మెండోరా మండల కేంద్ర శివారులో కాకతీయ కాలువ పక్కన గల పెద్దమ్మ మందిరం వద్ద భోజనం చేశారు. అనంతరం స్నానం చేయడం కోసం కాకతీయ కాలువలోకి దిగారు. కాలువ ప్రవాహ ఉధృతికి వేణు, ప్రణవ్ కొట్టుకు పోగా చింటు, పవిత్ర్‌రెడ్డిలు ప్రాణాలతో బయటపడ్డారు. ఒడ్డుకు చేరుకున్న చింటు, పవిత్ర్‌రెడ్డి ఈ విషయాన్ని స్థానికులకు తెలపగా.. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రాజెక్ట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ప్రాజెక్ట్ అధికారులు కాకతీయ కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. చీకటి పడడంతో గాలింపు చర్యలు చేపట్టలేకపోయారు. శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

కారు దగ్ధం



కాలిపోతున్న కారు

బాన్సువాడ రూరల్: మండలంలోని దేశాయిపేట్ గ్రామానికి చెందిన గాండ్ల దినేష్ కారు శుక్రవారం రాత్రి కాలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాలు.. దినేష్ బాన్సువాడ వైపు కారులో వస్తుండగా రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దినేష్ అదేపనిగా ఎక్సలేటర్ ఇవ్వడంతో సాంకేతిక సమస్య తలెత్తి కారులో మంటలు వ్యాపించారు. ప్రమాదం నుంచి దినేష్ తప్పించుకున్నా కారు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఫైర్‌సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పి వేశారు.

వివాహిత అదృశ్యం

బోధన్‌రూరల్: సాలూర మండలం తగ్గెల్లీ గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. సదరు మహిళకు మహరాష్ట్రలోని ఏస్గీ గ్రామానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె కొంత కాలం నుంచి భర్తకు దూరంగా ఉంటూ తగ్గెల్లీలో పిల్లలతో కలిసి ఉంటోంది. కొన్ని రోజుల నుంచి ఆమె కనబడకపోవడంతో కుటుంబసభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నగరంలో యువతి..

ఖలీల్‌వాడి: నగరంలోని జెండాగల్లీకి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు రెండో టౌన్ ఠాణా ఎస్సై అశోక్ తెలిపారు. ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.